మూఢ నమ్మకాలపై, చట్టాలపైన ప్రజలకు అవగాహన కల్పించాలి : డీఎస్పీ

విశాలాంధ్ర-మెంటాడ: ప్రతి గ్రామంలోనూ చట్టాల పైన మూఢనమ్మకాల పైన ప్రజలకు అవగాహన కల్పించాలని నేరచరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంచాలని బొబ్బిలి డి.ఎస్.పి భవ్య అన్నారు. వార్షికోత్సవ తనిఖీల్లో భాగముగా సోమవారం ఆంధ్ర పోలీస్ స్టేషన్ ను సందర్శించి తనిఖీ చేశారు. ఆంధ్ర పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ రకాల నేరాలలో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. స్టేషన్ కు సంబంధించిన వివిధ ప్రాపర్టీని, కేసులు నమోదు పెండింగ్ కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రేటు పై సమీక్ష నిర్వహించి నేరాలను తగ్గించే దిశగా కృషిచేయాలని సలహాలు సూచన తెలియ జేశారు. గంజాయి, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తదితర విషయాలపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలని సిబ్బందిని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమణ ఎస్సై సీతారాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు గ్రామాలను పరిశీలించిన మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-మెంటాడ: మొన్నటి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు కోనేరు గెడ్డకు గండిపడి ముంపుకు గురైన పొలాలను, లక్ష్మీపురం చంపావతి నదిపై రాకపోకల కొరకు నిర్మించిన కల్వర్ట్ కొట్టుకుపోవడాన్ని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పరిశీలించారు. కోనేరు గెడ్డ గండి విధానాన్ని పరిశీలించిన మంత్రి తక్షణమే గండి పూడిక కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముంపుకు గురై పంట నష్టం వాటిల్లిన రైతులకు న్యాయం చేకూరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం లక్ష్మీపురం చంపావతి నదిపై నిర్మించిన కల్వర్టు పరిశీలించిన మంత్రి విద్యార్థులకు అత్యవసర పరిస్థితులకు ఆటంకం కలుగకుండా ప్రకృతి సహాయ నిధులు నుండి రెండు లక్షల 50 వేలు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వెంటనే కల్వర్ నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు గెద్ద అన్నవరం ఎంపీటీసీ రెడ్డి నాయుడు తాడ్డి నాగరాజు ఎవర్ని అప్పారావు గెద్ద కాశీ బిజెపి మండల అధ్యక్షులు మణిపూరి అప్పలనాయుడు ఎంపీడీవో భానుమూర్తి, తాసిల్దార్ అరుణ్ కుమారి, ఆంధ్ర ఎస్సై కె.సీతారాం ఇరిగేషన్అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా లోటు లేదనే విషయం రైతులకు తెలియజేయాలి

అమ్మవారి పండగ ఏర్పాట్లను ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో యూరియా లోటు లేదనే విషయాన్ని రైతులకు అర్థం అయ్యేలా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. రెండో విడత కోసం ఇండెంట్ పెట్టడం జరిగిందని, వచ్చిన వెంటనే అందజేయడం జరుగుతుందని తెలియజేయాలన్నారు. పిజిఆర్ఎస్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఆదివారం మండల ప్రత్యేకాధికారులంతా ఆర్.ఎస్.కే లను తనిఖీ చేసి నివేదికలు అందజేశారని తెలిపారు. అయితే మొదటి విడత పంపిణీ ఇంచుమించుగా పూర్తి చేసామని, రెండో విడత కూడా 30 శాతం పై బడి పూర్తి చేసామని, మిగిలినవి వారం లోగా పంపిణీ చేయడం జరుగుతుందని స్పష్టం చేసారు. ప్రతి రైతు రెండో విడత యూరియ సరఫరా పైనే ఆందోళన చెందుతున్నారని, సరఫరాకు సమయం ఇంకా ఉందని అన్నారు. రెండో విడత ఎంత వస్తుంది, ఎక్కడ ఎప్పుడు ఎంత సరఫరా చేస్తామో ఒక షెడ్యూల్ ను సిద్ధం చేయాలనీ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తారక రామా రావు కు ఆదేశించారు. మండల తహసిల్దార్ , ఎం.పి.డి.ఓ , ప్రత్యేకాదికారులు వారి పనులు చూస్తూనే యూరియా సరఫరా పై కూడా పర్యవేక్షణ చేయాలనీ , రానున్న రెండవ విడత పంపిణీ సక్రమంగా జరిగే వరకూ పర్యవేక్షించాలని ఆదేశించారు. పైడి తల్లి అమ్మవారి పండగ ఏర్పాట్ల పై సమీక్షిస్తూ ఎవరికీ కేటాయించిన విధులను వారు ఇచ్చిన గడువు లోపలే పూర్తి చేయాలనీ అధికారులకు సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన 50 లక్షల విడుదల కోసం డి.ఓ లేఖ రాయడం జరిగింది, ఆ నిధులు వస్తే ఎలా ఖర్చు చేయాలో జేసి ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ వెంటనే ఒక నోట్ ను తయారు చేసి డి.ఆర్.ఓ కు సమర్పించాలని ఆదేశించారు.

శ్రీ లక్ష్మీ శ్రీనివాస మిల్లు భూమిలో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

ఆర్డీవోకు కార్యాలయంలో సిపిఐ వినతి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో ఉన్న శ్రీ లక్ష్మీ శ్రీనివాస జ్యూట్ మిల్ భూమిలో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని జూట్ మిల్లును కొనుగోలు చేసిన వ్యక్తులు. బరితెగించి. జూట్ మిల్లు స్థలంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిలో గతంలో రెవెన్యూ యంత్రాంగం ఏర్పాటు చేసినటువంటి ప్రభుత్వ హెచ్చరిక బోర్డును తొలగించి ఆ స్థలాన్ని కబ్జా చేశారని. కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు నమోదు చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని భారతకమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ శ్రీనివాస జూట్ మిల్లు స్థలంలో ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతుందని గతంలో పలుమార్లు బొబ్బిలిలో సంబంధిత శాఖ అధికారులు రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు చేసినప్పటికీ. రెవెన్యూ యంత్రాంగం ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం వల్ల ఇదే అదునుగా లక్ష్మీ శ్రీనివాస జూట్ మిల్ భూముల్లో ఉన్న ప్రభుత్వ భూమిని భూ కబ్జాదారులు రెచ్చిపోయి కబ్జా చేసి చదును చేస్తున్నారని ఏదైతే శ్రీ లక్ష్మీ శ్రీనివాస భూముల్లో భూకబ్జాలపైన సమగ్ర విచారణ చేపట్టి. కబ్జాలకు గురైనటువంటి ప్రభుత్వ భూములను రెవెన్యూ యంత్రాంగం స్వాధీనం చేసుకొని ఇల్లు లేని నిరుపేదలకు పంచాలని సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 29 మేకలు మృతి

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తహసిల్దార్

పోస్టుమార్టం నిర్వహించిన పశు వైద్యాధికారి

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని కొండగంగపూడి లో ఆదివారం సాయంత్రం వర్షంతో పాటు ఒక్కసారిగా పిడుగు పడగా వర్షానికి మేకలన్ని ఒక్క చెట్టు దగ్గరికి చేరదంతో పిడుగుపాటుకు గిరిజన రైతులు నంది రమేష్ , గలారి పెదసాహెబ్, సార ఎర్రయ్యమ్మ సార బుచ్చమ్మ గలారి కేకులు అనే రైతులకు చెందిన 29 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ మేరకు విషయం తెలుసుకున్న తహసిల్దార్ జె. రాములమ్మ సోమవారం సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అలాగే బొద్దాం పశువైద్యాధికారి ఏం.అనిల్ కుమార్, సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన మేకలకు పోస్టుమార్టం నిర్వహించారు.అలాగే వీఆర్ఓ అప్పారావు మృతిచెందిన మేకల విషయమై పంచనామా నిర్వహించి ఏ రైతుకు సంబంధించినవి ఎన్ని మేకలని ఆస్తి నష్టం ఎంత మేరా వాటిల్లిందో రిపోర్టు తయారుచేసిఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గళారి బంగారయ్య, వైస్ ఎంపీపీ దాయరి ముత్యాలమ్మ, టిడిపి నాయకులు వరవాడ జగదీష్, మమ్ములూరుసూర్యానారాయణ, గిరిజన రైతులు పాల్గొన్నారు.

నేత్రదానం గొప్పది...

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-లక్కవరపుకోట : అన్ని దానాల కన్నా నేత్రదానం గొప్పదని ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల కేజీబీవీ పాఠశాలలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ అంధత్వ నివారణ లో భాగంగా ఆగస్టు 25 నుంచి ఈనెల 8 వరకు జరుగు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. అన్ని దానాల కన్నా రక్తదానం, అన్నదానం చాలా విలువైనవని వాటితో పాటు నేత్రదానం కూడా ముఖ్యమని తెలి పారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచు కొని సామాజిక బాధ్యతగా తీసుకుని పదిమందికి చెప్పాలని కోరారు. ఈ నేత్రదానం రెండు లేదా మూడు సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల వరకు ఎవరైనా చేయవచ్చును అన్నారు. చాలా స్వచ్ఛంద సంస్థలు నేత్రదానం ద్వారా కళ్ళు లేని వారికి చూపు కలిగించే విధంగా దోహదపడు తున్నాయని తెలిపారు. ముందుగా నేత్రదానం అవగాహన రాలి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో ఎస్సే రైటింగ్‌లో గెలుపొందిన విద్యార్థులకు అవార్డులు అందించారు. కార్యక్ర మంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు రత్నాజీ, గొంప దుర్గా ఉమేష్, ఎంపీటీసీ రమేష్ నాయుడు, కేజీబీవీ ఎస్ ఓ బి ప్రవీణ, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై వినతి

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతి నగరం మండల తాసిల్దార్ రత్నకుమార్ కు రైతు సమస్యలపై వినతి పత్రాన్ని సోమవారం ఏఐటియుసి నియోజకవర్గ కన్వీనర్ పురం అప్పారావు ఆధ్వర్యంలో రైతులు అప్పలనాయుడు, రాజు కిరణ్ కుమార్ తదితరులు కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని వాతావరణం అనుకూలించక వరి నాట్లు ఆలస్యంగా జరిగినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలు నియోజకవర్గంలో 95% పైగా వరి నాట్లు జరిగి కలుపు తీతలు జరుగుతున్నప్పటికీ ఎరువులు రైతాంగానికి అందించలేని పరిస్థితి దాపురించిందని, ఇప్పుడు ఇస్తున్న ఎరువులు అంతంత మాత్రంగానే ప్రభుత్వం ఇస్తుందని దీనికి తోడు టోకెన్ సిస్టం అని సంబంధిత డీలర్లు ఇచ్చున్నప్పటికీ రైతుకు ఎంత పంట భూమి ఉన్న ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తున్నారన్నారు. దొడ్డి దారిన బ్లాక్ మార్కెట్లో కొనుక్కోవాల్సి వస్తుందని కనుక ప్రతి రైతుకు పాసుబుక్కు ప్రకారం మూడు బస్తాలు యూరియా ఇవ్వాలని బ్లాక్ మార్కెట్ ను అరికట్టాలని తాసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేడు ఎరువుల బ్లాక్ మార్కెట్ పై "అన్నదాత పోరు"

విశాలాంధ్ర-తెర్లాం: బొబ్బిలి నియోజక వర్గం తెర్లాం మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతన్నలకు బాసటగా సెప్టెంబర్ 9న జరగనున్న ఎరువుల బ్లాక్ మార్కెట్ పై "అన్నదాత పోరు" కార్యక్రమ పోస్టర్ ను తెర్లం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో ఆవిష్కరించిన, తెర్లాం మండల ప్రజా ప్రతినిధులు, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

60వ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేరు ...!

విశాలాంధ్ర-విజయనగరం, కంటోన్మెంట్ : నగరంలో 50 డివిజన్ పరిధిలో కీలకమైన వార్డు వైఎస్ఆర్ నగర్. ఇక్కడ సేవలు అందించేందుకుగాను ఏర్పాటు చేసిన 60వ సచివాలయం పలు విమర్శలను మూట గట్టుకుంటుంది. ఏ సేవ కోసం అక్కడికి వెళ్తే... లేదు...కుదరదు అనే మాట వినిపిస్తుంది. కనీసం ప్రత్యామ్నాయ మార్గం కూడా చెప్పడం లేదు. ఓటర్ రిజిస్ట్రేషన్, కుల ధృవీకరణ పత్రాలు, ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ లో పేర్లు నమోదు, శానిటేషన్ సమస్యపై స్పందించడం లేదన్న వాదన వినిపిస్తుంది. గత కొద్దిరోజులుగా డిజిటల్ అసిస్టెంట్ కూడా లేరని, సచివాలయానికి డిజిటల్ అసిస్టెంట్ పాత్ర కీలకమనే విషయాన్ని అధికారులు విస్మరించడం వార్డు ప్రజల్లో ఆవేదన వ్యక్తం అవుతుంది.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు రాజాం క్రీడాకారులు

విశాలాంధ్ర-రాజాం: పికిల్ బాల్ టోర్నమెంట్ అసోసియేషన్ సెకండ్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఈనెల 6, 7 తేదీలలో విజయవాడ లో జరిగిన పికిల్ బాల్ బ్యాడ్మెంటన్ ఛాంపియనిషిప్ పోటీలలో రాజాం ప్రాంతా నికి చెందిన క్రీడాకారులు పివిజి కృష్ణంరాజు (తృప్తి రిసార్ట్స్ అధినేత మురళీ మాస్టర్), డా. బిహెచ్ అరుణ్ కుమార్ (పీడీజీఎంఆర్ఐటి), డా. ఎం. పురుషోత్తం (జిసిఎస్ఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్), సిహెచ్ రామకృష్ణంరాజు (జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్), బి. శాంతి స్వరూప్ (సిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ హెచ్ఎర్వైడ్), ఆర్. విజయకృష్ణ (జిఎంఆర్టి ప్రొఫెసర్) ఎంపికయ్యారు. 35-55 సంవత్సరాల మధ్య వయస్సు గల క్రీడాకారుల పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 115 టీమ్ ల క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో రాజాం కు చెందిన క్రీడాకారులు బ్రాంచ్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం విశేషం, వీరంతా ఈ నెల 26 నుంచి 29 వరకు జమ్మూకశ్మీర్ లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.అక్కడ కూడా మంచి ప్రతిభ కనబరచి, రాజాం ఖ్యాతిని నలుదిక్కులా వ్యాప్తి చెందేలా చేస్తారని రాజాం ప్రాంత క్రీడాకారులు ఆశిస్తూ, వారిని అభినందిస్తున్నారు.

చంద్రగ్రహణం ఎవరికీ హాని చేయదు...!

ఇది ఒక ఖగోళ ప్రక్రియ

సాధారణంగానే పనులు చేసుకోవచ్చు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: చంద్రగ్రహణం ఖగోళంలో జరిగే ఒక అద్భుతమైన ప్రక్రియని,ఈ గ్రహణాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించి ఆనందాన్ని పొందవచ్చని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.చంద్రగ్రహణం వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని,ఈ గ్రహణం ఎవ్వరికి హాని చేయదని తెలిపారు. గ్రహణం సమయంలో కూడా తమ పనులను ఎప్పటిలాగే సాధారణంగానే నిర్వహించుకోవచ్చని ప్రజలకు తెలియజేసేందుకు జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో అల్పాహారాన్ని తీసుకుని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ భూమి,సూర్యుడు,చంద్రుడు ఒకే సరళ రేఖపై వచ్చినప్పుడు భూమి నీడ చంద్రుడుపై పూర్తిగా పడటం వలన సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుందని,భూమిపై పడిన సూర్యకిరణాలు తిరిగి చంద్రుడిపై రిఫ్లెక్ట్ అవ్వడం వల్ల రెడ్ మూన్ గా మారుతుందని తెలిపారు.ఈ ప్రక్రియ ప్రతి రెండు మూడు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుందని,అయితే గతానికి భిన్నంగా ఈసారి 82 నిమిషాలపాటు ఈ గ్రహణం ఏర్పడిందని, ఇంత సుదీర్ఘ చంద్ర గ్రహణం కొన్ని సంవత్సరాలకు ఒకసారి మాత్రమే ఏర్పడుతుందని స్పష్టం చేశారు.అదేవిధంగా చంద్రగ్రహణం చుట్టూ అనేక మూఢనమ్మకాలు ప్రచారంలో ఉన్నాయని,వాటిని ఎవరు నమ్మవద్దని సూచించారు.గర్భిణీలతో పాటు సామాన్య ప్రజలు కూడా ప్రతిరోజు మాదిరిగానే గ్రహణం సమయంలో యధావిధిగా తమ పనులు చేసుకోవచ్చని తెలిపారు.ఈ గ్రహణం వల్ల కొన్ని రాశుల వారికి తీవ్రమైన నష్టం జరుగుతుందని కొంతమంది అసత్య ప్రచారం చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని,గ్రహణాలు వస్తుంటాయి పోతుంటాయి, వీటివల్ల ఎవరికి ఏ విధమైన నష్టం జరగదని పేర్కొన్నారు.జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ,గంట్రేటి శ్రీనివాసరావు, షిణగం శివాజీ,డాక్టర్ పైల రమేష్ రాజు,సుంకర సూర్యనారాయణ, సీరాపు శ్రీను,గంట్రేటి నిర్మల పాల్గొన్నారు.

గంజాయి దుష్ప్రభావాలు, చట్టపరమైన శిక్షలపై ఎస్సై దుర్గాప్రసాద్ అవగాహన

విశాలాంధ్ర -పూసపాటిరేగ: సూర్యోదయ జూనియర్ కాలేజీ లో విద్యార్థులకు గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన శిక్షలపై ఎస్సై దుర్గాప్రసాద్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం సోమ వారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అలవాటు యువత భవిష్యత్తుకు హానికరమని, అది చదువులో వెనుకబాటు, ఆరోగ్య సమస్యలు, మానసిక ఆందోళనలకు దారితీస్తుందని వివరించారు. అలాగే ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం గంజాయి వాడకం, నిల్వ, రవాణా, విక్రయం అన్నీ నేరమని, వాటిని ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి లక్ష్యాలను సాధించాలని సూచించారు.

మున్సిపల్ గ్రీవెన్స్ కు 3 వినతులు

విశాలాంధ్ర-విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలువురు నుండి మూడు వినతులు వచ్చాయి. విజయ నగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ మేరకు వినతులను స్వీకరించారు. హౌసింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాలకు ఒక్కొక్క వినతి పత్రం అందాయి. ఆయా వినతులను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత విభాగాధిపతులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ఈఈ ప్రసాదు పాల్గొన్నారు.

ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు కు తరలిరండి

వైఎస్సార్ పార్టీ మండల అధ్యక్షులు ఉప్పాడ

విశాలాంధ్ర-భోగాపురం : ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు కు తరలిరావాలని వైఎస్సార్ పార్టీ మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతులకు బాసటగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమం నేడు ఉదయం 10 గంటలకు విజయనగరంలో నిర్వహించనున్నట్లు అయన తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బడ్డుకొండ అప్పలనాయుడు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగనుందన్నారు. ఇందులో భాగంగా ఆర్డీఓకు వినతి పత్రం అందజేయనున్నారు.ఈ కార్యక్రమానికి వైఎస్సార్ పార్టీ నాయకులు అభిమానులు, కార్యకర్తలు రైతులతో హాజరుకావాలని సూర్యనారాయణ రెడ్డి కోరారు. ఉదయం 9 గంటలకు అక్కివరం జంక్షన్ వద్దకు చేరుకోవాలన్నారు.

గిరిజా ప్రసన్నకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ,తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి, ,కాకినాడ జిల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ వి వి సత్యనారాయణల చేతుల మీదుగా భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇన్స్పిరేషనల్ అవార్డు (Sarvepalli Radha Krishnan Inspirational Award-2025) ను విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన సముద్రాల గిరిజా ప్రసన్న అందు కున్నారు. పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన ఈ కార్యక్రమం లో అల్లూరి సీతారామరాజు జిల్లా డీఈవో వై మల్లేశ్వరరావు ,నిర్వాహకులు పాల్గొన్నారు

పికిల్ బాల్ ఛాంపియన్షిప్ కైవసం చేసుకున్న మాజీ మంత్రి, ఏపి అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కృష్ణ రంగారావు

విశాలాంధ్ర-బొబ్బిలి: విజయవాడలో రెండు రోజులపాటు కొనసాగిన ఆంధ్రప్రదేశ్ పికిల్ బాల్ ఛాంపియన్ షిప్ 2025 పోటీల్లో మాజీ మంత్రి ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు పురుషుల డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచారు. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విశాఖపట్నానికి చెందిన ముని అనంత్ తో సుజయ్ కృష్ణ రంగారావు జోడిగా పోటీల్లో పాల్గొన్నారు. పురుషుల డబుల్స్ విభాగంలో దాదాపు 32 టీమ్ లు పోటీ పడ్డాయి. ఫైనల్స్ లో సుజయ్ జోడీ విజయవాడకు చెందిన రోహిత్ ,చరణ్ జోడీని ఢీకొట్టారు. మూడు సెట్స్ ఉత్కంఠభరితంగా కొనసాగాయి. సుజయ్ కృష్ణ రంగారావు అనంత్ జోడీ ఛాంపియన్ టీమ్ గా నిలిచింది. గోల్డెన్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. మరోవైపు 50ం పురుషుల డబుల్స్ విభాగంలో సుజయ్ కృష్ణ రంగారావు, రావు బదరీ జోడీ సత్తా చాటింది. ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించారు. ఓపెన్ మెన్స్ విభాగంలో మాజీ మంత్రివర్యులు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు టీమ్ విజేతగా నిలవడంతో క్రీడాభిమానులు అభినందించారు. 50 ఏళ్ల వయసులో మెన్స్ విభాగంలో విజేతగా సుజయ్ కృష్ణ రంగారావు నిలవడం పికిల్ బాల్ ప్లేయర్స్ కి స్ఫూర్తిదాయకమని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ పికిల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్-2025 ఓపెన్ మెన్స్ డబల్స్ మరియు 50ం మెన్స్ డబల్స్ లో మాజీ మంత్రివర్యులు, %ూరాా% గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ శ్రీ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు గారు గోల్డ్ మెడల్స్ సాధించి తన క్రీడా పటిమను చాటారని పికిల్ బాల్ అసోసియేషన్ సభ్యులు, ప్రముఖ నాయకులు, ప్లేయర్స్ మరియు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన మల్లిక్ , రావు బదరి 35ం విభాగంలో డబుల్స్ లో సిల్వర్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. 35ం మెన్ సింగిల్స్ విభాగంలో మల్లిక్ బ్రాంజ్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. 50ం మెన్ సింగిల్స్ విభాగంలో రావు బదరి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పికిల్ బాల్ జాతీయ స్థాయి పోటీలు ఈ నెల 26 తేదీన జమ్మూ లో ఆల్ ఇండియా పికిల్ బాల్ అసోసియేషన్ నిర్వహించనుంది. విజేతలను ఆంధ్రప్రదేశ్ పికిల్ బాల్ అసోసియేషన్ జాతీయ స్థాయి పోటీలకు పంపిచనున్నారు.

మైక్రో బాడ్మింటన్ కప్ విజేతగా డాక్టర్ మరిచెర్ల గౌతమ్ కుమార్

విశాలాంధ్ర-వంగర: ఏడి బ్యాడ్మింటన్ అకాడమీ విశాఖపట్నం ఈనెల 7న నిర్వహించిన మైక్రో బాడ్మింటన్ కప్ పోటీల్లో (వంగర మండలం జెకెగుమ్మడ గ్రామానికి చెందిన) నెలిమర్ల నిమ్స్ వైద్యులు డాక్టర్ మరిచెర్ల గౌతమ్ కుమార్ గాంధీ డబుల్స్ గ్రూపులో విన్నర్ గా నిలిచారు . ఈ మేరకు ఏడి బ్యాడ్మింటన్ అకాడమీ పౌండర్ అవంతిక లెక్క విజేతలకు ప్రత్యేక మెమెంటో(ట్రోఫీ)ను, సర్టిఫికేటును అందజేశారు. ఇటీవల ఎండి జనరల్ మెడిసిన్ పూర్తిచేసి న మరిచెర్ల గతంలో అనేక రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచారు .ఒకవైపు వైద్యవిద్యను అభ్యసిస్తూనే ఆట్లపట్ల ఆసక్తితో బ్యాడ్మింటన్ పోటీలకు అటు కళాశాల తరఫున, ఇటు వ్యక్తిగతంగా హాజరవుతూ అనేక పోటీల్లోపాల్గోని విజేతగా నిలిచారు. ఈ సందర్భంగాడా గౌతమ ను కళాశాల సిబ్బంది ,తోటి విద్యార్థులు అభినందించారు.

పిజిఆర్ఎస్ కు 167 వినతులు

-గడువు దాటక ముందే పరిష్కరించాలి- కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్ లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని, ఇంకనూ చూడవలసిన కాలం లో ఎప్పుడు చూసినా సున్నా కనపడాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ లో కలెక్టర్ ప్రజల నుండి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు. గడువు లోపలే వినతులకు సమాధానాలు పంపాలని , లేని యెడల సంబందిత అధికారి పై చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం పిజిఆర్ఎస్ కు 167 వినతులు అందాయి. కలెక్టర్ తో పాటు సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, విజయనగరం డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర రావు, ప్రమీల గాంధీ, మురళి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 167 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 58 వినతులు అందాయి. పంచాయతిశాఖ కు 12, పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్డిఏకు 42 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 14 , విద్యా శాఖకు 05, హౌసింగ్ కు 01, వైద్య శాఖకు 09, విద్యుత్ శాఖకు 05 అందగా మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి.

దివ్యాంగులకు విద్యార్థులు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పట్టణంలోని స్థానిక లక్ష్మీ గణపతి స్కూల్ కు చెందిన విద్యార్థులు అందుల కోసం విరాళాలను సేకరించారు. వాటిని సోమవారం ప్రిన్సిపల్ జి పద్మజా చేతుల మీదుగా స్ఫూర్తి ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వారికీ అందజేశారు. సుమారు రూ 32,669 రూపాయలను సొసైటీ వారికి అందజేశారు. విద్యార్థులు చిన్ననాటి నుండే ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొని పరుల కోసం పాటుపడుతున్న ప్రతి చిన్నారికి అభినందనలు తెలిపారు. చిన్ననాటి నుండే ఒకరికి సహాయ పడాలని ఆలోచన చిన్నారులకు రావడం అభినందనీయమని ప్రిన్సిపల్ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైసీపీ అన్నదాత పోరు

విశాలాంధ్ర-వేపాడ: రైతులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాత పోరు రైతులకు తోడుగా అనే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గిబాబు తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ దగ్గర నుండి బయలుదేరి, విజయనగరం ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లడం జరుగుతుందని కావున మండలంలో ఉన్న జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సీనియర్ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, ముఖ్యనాయకులు హాజరవ్వాలన్నారు. ఉదయం 8 గంటలకి భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ దగ్గరకి చేరుకోవాలని ఆయన కోరారు.

మెంటాడ: ప్రభుత్వం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమంలో నిర్లక్ష్య వైఖరిని తప్పుపడుతూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వైయస్సార్సీపి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్న రైతు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల అధ్యక్షులు రాయపల్లి రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు జిల్లా వైయస్సార్ పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి చిన్న శ్రీను ఆదేశాల మేరకు మాజీ మంత్రి పీడిక రాజన్న దొర సూచనలతో పార్వతీపురం ఆర్డీవో కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు సకాలంలో యూరియా అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని, చాలీచాలని యూరియా బస్తాల కొరకు ఎంత ప్రయాసతో కూడిన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. రైతు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు రెడ్డి రాజప్పలనాయుడు సిరిసెట్టి నారాయణరావు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: రైతు ప్రభుత్వం అని చెప్పుకునే మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయామములో రైతులకు యూరియా దొరకకపోవడం చాలా దారుణమని జెడ్పిటిసి సభ్యురాలు అప్పికొండ సరస్వతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద యూరియాపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నడూ కూడా రైతులకు ఎరువులు కొరత రానీయకుండా అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చూసేవారని అన్నారు. మంగళవారం బొబ్బిలి గ్రోత్ సెంటర్లో ఉన్న ఆర్డీఓ కార్యాలయం వద్ద పోరుబాట కార్యక్రమంలో భాగంగా నిరసన తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ సింహాచలం నాయుడు, పాల సొసైటీ అధ్యక్షులు సి. హెచ్. చిన్నమనాయుడు, రాయల్ పంతులు, దర్రు పైడ్రాజు, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు కీర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరమే అభివృద్ధికి మూలం

ఐయుకెయఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మమ్ముల

విశాలాంధ్ర-గుర్ల: మంచి పౌర సమాజం ఏర్పాడలన్నా సామాజికంగా అభివృద్ధి చెందాలన్నా అక్షరమే మూలం అని ఇంటర్నేషనల్ యునైటెడ్

కలాం ఫౌండేషన్ ఏపి అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని పోలాయవలస గ్రామానికి చెందిన హెల్పింగ్ హేండ్స్ యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి మాతృభూమి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు సుమారు 5వేలు రూపాయలు విలువ గలిగిన పుస్తకాలు వితరణ చేసే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య మాత్రమే అని, మతాల కతీతంగా అందరు దర్శించేది గ్రంథాలయాలు మాత్రమే అని అన్నారు. కార్యక్రమంలో గోపాలరావు, అశోక్, నారాయణరావు, అప్పన్నబాబు, సత్తిబాబు, రాజు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై ఎమ్మార్వో సమీక్ష

విశాలాంధ్ర- చీపురుపల్లి: రాజకీయ పార్టీల నాయకులతో తహశీల్దార్ డి.ధర్మరాజు సమీక్ష నిర్వహించారు. నియోజవర్గంలో ఉన్నటువంటి ఓటర్లు నమోదు, సవరణలు, తొలగింపు, మైగ్రేషన్ ఓటర్ల సవరణలు వంటి పలు కీలకమైన అంశాలపైన చర్చించారు. వాటిపైన ప్రభుత్వ అధికారులతో పాటుగా రాజకీయ నాయకుల సహకారం కూడా ఎంతో అవసరమని ఎప్పుడైనా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటర్‌గా నమోదు చేసుకోవచ్చున్నారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ ఉమ్మడి విజయనగరం జిల్లా కో-ఆర్డినేటర్ కోట్ల కృష్ణ, బిజెపి మాజీ మండల అధ్యక్షులు ఇప్పిలి నీలకంఠం, చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ మరియు వైఎస్ఆర్ సీపీ నాయకులు పి.మురళి, డిప్యూటీ తహసీల్దార్ (ఎలక్షన్స్) ఎం. హర్షవర్ధిని పలువురు పాల్గొన్నారు.

వైసీపీ నియోజకవర్గ పరిశీలకులుగా పులి రాజు



విశాలాంధ్ర - రాజాం: వైఎస్ఆర్సీపీ పార్టీ అధ్యక్షులు వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు రాజాం నియోజకవర్గం పరిశీలకులుగా నియమితులైన కె.వి.సూర్యనారాయణ రాజు(పులి రాజు), రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా. తలే రాజేష్‌ని రాజాం టౌన్‌లో వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం రాజాం నియోజకవర్గం పరిశీలకులుగా నియమితులైన కే. వి.సూర్యనారాయణ రాజు(పులిరాజు)ని దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా. తలే రాజేష్, రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాస రావు, రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాల్ నాయుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు వాకముళ్ళ చిన్నం నాయుడు, జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షులు డా. బి. నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా నిల్వలు

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర - విజయనగరం: ప్రస్తుత పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా జిల్లాలో తగినంతగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని ఆయన తెలియజేశారు. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాస్ ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ మరియు వ్యవసాయ శాఖ అధికారులకు తగిన సూచనలు ఇస్తూ, రైతులకు అవసరమైన యూరియా అందించటం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సీజన్.లో ఇప్పటి వరకు 26,989 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించటం జరిగిందని తెలిపారు.

ప్రస్తుతం జిల్లాలో 657 మెట్రిక్ టన్నుల యూరియా ఎస్-ఎస్‌కెల్లో, ప్రయివేటు వర్తకుల వద్ద సిద్ధంగా ఉందని తెలిపారు. మంగళ, బుధవారాలలో రెండు వేల టన్నులు యూరియా జిల్లాకు రానుందని తెలిపారు. కొనుగోలు విషయంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటి కప్పుడు తెలుసుకుని అందుకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి శ్రీనివాస్ ఈ ప్రకటనలో వివరించారు.

శరవేగంగా పట్టణంలో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - విజయనగరం: నగరంలో వివిధ ప్రాంతాలలో అభివృద్ధి, మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది వివిధ పనుల్లో నిమగ్నమయ్యారు. రానున్న పైడితల్లి అమ్మవారి జాతర నేపథ్యంలో ఇంజనీరింగ్ పనులను ముమ్మరం చేస్తున్నారు. ఈనెల 20వ తేదీ నాటికి నిర్దేశిత పనులు పూర్తి కావాలని కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి నిర్దేశించారు. దీంతో పనుల ప్రక్రియ ఊపందుకుంది. స్థానిక రాజారావు మెడ వద్ద బి.టి. రహదారి మరమ్మతు పనులు సాగుతున్నాయి. అలాగే ప్రశాంతి నగర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యొక్క కాంక్రీట్ పని జరుగుతుంది. గాయత్రి నగర్ లో సిసి రోడ్డు నిర్మాణం సాగుతోంది. మయూరి ఎత్తు బ్రిడ్జి వద్ద సిసి బెర్మ్ పనులు చేపట్టారు. కాటవీధి వద్ద కల్వర్టు మరమ్మత్తు పనులు పూర్తి చేశారు. గాయత్రి నగర్లో సిసి రోడ్డు పనులు జరుగుతున్నాయి. కాళీమాత టెంపుల్ ప్రాంతంలో రింగ్ రోడ్డు పరిసరాలలో ఉన్న డివైడర్ గ్రిల్స్ కు రకరకాల రంగులను అద్దుతున్నారు. ఆయా పనులను డిఈ శ్రీనివాసరావు, ఏఈలు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. ఇది ఇలా ఉంటే నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ ప్రాంతాన్ని డిఈ నరసింహారెడ్డి పరిశీలించారు. కొన్ని ప్రాంతాలలో రహదారులకు ఇరువైపులా ఉన్న లతలను సిబ్బంది తొలగించారు. గుబురుగా ఉన్న ప్రాంతాలను చదును చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పైడితల్లమ్మ జాతర నాటికి నగర సుందరీకరణలో భాగంగా అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నామన్నారు. ఈనెల 20వ తేదీలోగా పనులు పూర్తి చేసి ప్రజలకు భక్తుల కోసం నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దునున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం మరింత సమర్థవంతంగా జాతర నిర్వహించేందుకు అందరి సమన్వయంతో కృషిచేస్తున్నామన్నారు.

బాల్య వివాహాలు వద్దు - భవిష్యత్తు ముద్దు

విశాలాంధ్ర-విజయనగరం: కంటోన్మెంట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఉత్తర్వులు మేరకు విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్ విజయనగరం జిల్లా, గంట్యాడ మండలం మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన న్యాయ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల్య వివాహాలపై న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ 18 సంవత్సరములోపు బాల బాలికలకు వివాహము చేయుట చట్టరీత్యా నేరమని అందుకు రెండు సంవత్సరములు వరకు జైలు శిక్ష, జరిమానా ఉంటాయని తెలియజేశారు. అనేక కారణాలవల్ల చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు చేయటం సరైనది కాదని తెలిపారు. చిన్న వయసులోనే వివాహాలు చేయటం వల్ల అనేక అనేక అనారోగ్య సమస్యలు శారీరక సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. బాల్య వివాహాల రద్దు చట్టం గురించి బాల, బాలికలకు వారికి అర్థమయ్యే రీతిలో తెలియజేశారు. ఒకవేళ ఎవరైనా ఎక్కడైనా ఎప్పుడైనా బాల్య వివాహము జరిగినట్లు, చేస్తున్నట్లు మీకు తెలిస్తే మీరు వెంటనే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ నెంబర్ 1098 కు,జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేసి తెలియజేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. వి.జగన్నాథరావు, గంట్యాడ ఎస్సై డి.సాయికృష్ణ,వన్ స్టాప్ సెంటర్ ఏవో సాయి, విజయలక్ష్మి కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు వాడకం తగ్గించాలి

విశాలాంధ్ర - భోగాపురం : మండలంలోని భోగాపురం గ్రామంలో సోమవారం యూరియా వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి బి.శాంతి మాట్లాడుతూ రైతులు అధికంగా యూరియా వాడడం వలన నేల నిస్సారమై పంటలు, మనిషి

ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు మాత్రమే ఎరువులు వాడితే రైతుల ఖర్చు తగ్గి ఆరోగ్యకరమైన పంటలు పండుతాయని సూచించారు.ఎంపీడీవో గాయత్రి మాట్లాడుతూ రైతులు తమ అవసరానికి తగ్గట్టు మాత్రమే ఎరువులు సేకరించుకోవాలని సూచించారు. వ్యవసాయ హైమావతి అధికారి మాట్లాడుతూ యూరియా, డిఏపి బదులు నానో యూరియా, నానో డిఏపి వాడితే మొక్కలకు వేగంగా పోషకాలు అందుతాయని, ఒక్క ఎకరానికి 500 ఎంఎల్ సరిపోతుందని, తేలికగా పిచికారి చేసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ టి.వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల దాడి వల్లనే నైట్ వాచ్‌మెన్ మృతి

విశాలాంధ్ర - రాజాం: లారీ డ్రైవర్ల దాడి వల్లనే సంతకవిటి మండలం పొనుగుటివలస గ్రామానికి చెందిన కోడూరు ముత్యాల నాయుడు మృతి చెందినట్టు దర్యాప్తులో వెల్లడైందని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర తెలిపారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత నెల 14వ తేదీన ఈ ఘటన జరిగిందన్నారు. పొనుగుటివలస గ్రామ పరిధిలోని లక్ష్మీనారాయణ రైస్ మిల్ లో కోడూరు ముత్యాల నాయుడు నైట్వాచ్మెన్ గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణ సమయంలో అనందపురం మండలంకు చెందిన ఇద్దరు లారీ డ్రైవర్లు దాడి చేయడంతో తన కుడిమక్క పూర్తిగా విరిగిపోయినది. వైద్య పరీక్షలు నిర్వహించి సర్జరీ చేసినప్పటికీ ఈ నెల 06 న మరణించాడని చెప్పారు. విచక్షణా రహితంగా దాడి చేసిన లారీ డ్రైవర్లు బూర్లే నాగరాజు, కోరాడ చిన్నప్పుడు లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్టు తెలిపారు. ఆయనతో పాటు సంతకవిటి ఎస్ఐ కూడా ఉన్నారు.

క్లాప్ మిత్రులకు రెయిన్ కోట్లు పంపిణీ

విశాలాంధ్ర - కొత్తవలస : వర్షాకాలం దృష్ట్యా కొత్తవలస మేజరు పంచాయతీ పరిధిలో గల 25మంది క్లాప్ మిత్రలకు గ్రామ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి ఆధ్వర్యంలో సోమవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. వర్షంలో తడవకుండా పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని, అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ రామస్వామి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.శైలజ, సానిటరీ మేస్త్రి ఎం.వి.ఆర్.ఎల్.ఎస్.ప్రసాద్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వంగరలో దంచి కొట్టిన వర్షం

విశాలాంధ్ర - వంగర: మండలంలో భారీ వర్షం సోమవారం కురిసింది. అంతటా వర్షం దంచికొట్టింది. ఉదయం అంతా బారీగా ఎండతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికాగా, మధ్యాహ్నం 3 గంటలకు వాతావరంలో ఒక్కసారి మార్పు వచ్చి వెంటనే వర్షం మొదలైంది. వర్షం ప్రారంభం నుంచి ఏకధాటిగా దంచి కొట్టటంతో రోడ్లు, కాల్వలు, గ్రామాల్లో వీధులు నీటితో నిండిపోయాయి. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు.వర్షం కురుస్తున్న సమయంలో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, తో కూడిన వర్షం కురిసింది. పెద్దఎత్తున వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. ఈ వర్షం తోటపల్లి శివారు గ్రామాలు రైతులకు ఎంతో ఉపయోగపడిందని వంగర, శివ్వాం, తలగాం, ఎం.సీతారాంపురం గ్రామాల్లో పంట వరి పొలాలకు ఎంతో మేలు చేసిందని సాగురైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఓ

రెవిన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరిస్తాం

విశాలాంధ్ర -బాడంగి : మండలంలో నెలకొన్న రెవిన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి కృషి చేస్తామని తాసిల్దార్ వరప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు తాసిల్దారు జవాబిస్తూ గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పరిష్కారాన్ని చూపుతామని అన్నారు. మల్లంపేట రేషన్ డీలర్ గ్రామంలో లేకపోవడం వల్ల వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ విజయలక్ష్మి తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో డీలర్లంతా ఒకటి నుంచి 15 తేదీ వరకు సరుకులు పంపిణీ చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. గజరాయనవలస ఎంపిటిసి పాలవలస గౌరీ మాట్లాడుతూ కొత్తగా కార్డులు మంజూరైనప్పటికీ ఇంకా రేషన్ ఇవ్వట్లేదని అన్నారు అదేవిధంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులంతా సకాలంలో పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, వైస్ ఎంపీపీ సింగరేణి భాస్కర్, జడ్పిటిసి రామారావు, ఎంఈఓ లక్ష్మణదొర, పంచాయతీరాజ్ ఇంజనీర్ రమేష్ తో పాటు పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సుజల స్రవంతి భూ సేకరణను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర -విజయనగరం: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు భూ సేకరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఈ ప్రాజెక్టు భూ సేకరణపై తమ ఛాంబర్లో సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎస్.కోట, వేపాడ, కొత్తవలస మండలాల పరిధిలోని నాలుగు గ్రామాల్లో 108 ఎకరాలు, బొండపల్లి మండలంలోని 3 గ్రామాల పరిధిలో 126 ఎకరాల భూసేకరణ పై చర్చించారు. ఈ గ్రామాల రైతులతో త్వరలో సమావేశం నిర్వహించి ధర ఖరారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో భూసేకరణ విభాగం ప్రత్యేక ఉప కలెక్టర్ ఎం.ఎస్.కళావతి, సుజల స్రవంతి ఈఈ ఎ.ఉమేష్ కుమార్, ఆయా భూసేకరణ విభాగాల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలి

విశాలాంధ్ర - వేపాడ: పాఠశాలలో గల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంఈఓ పి.బాల భాస్కరరావు అన్నారు. మండలంలోని రాయుడుపేట మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను, బక్కు నాయుడుపేటలో గల కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలు తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్, అభినయగేయాలు, వర్ణమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఎంటి వై.వెంకటలక్ష్మి, కే.రామప్రసాద్ పాల్గొన్నారు.

బల్లంకిలో రైతులకు యూరియా పంపిణీ

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని బల్లంకి గ్రామంలో గల రైతు సేవా కేంద్రం ద్వారా 266 బస్తాల యూరియా రైతులకు పంపిణి చేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారిణి ఎం.స్వాతి అన్నారు. సోమవారం చేపట్టిన యూరియా పంపిణీ కార్యక్రమం మండల ప్రత్యేక అధికారి ఎన్. చిన రెడ్డయ్య పర్యవేక్షణలో సరఫరా చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి ఎన్.చిన రెడ్డయ్య మాట్లాడుతూ రైతులు యూరియా పట్ల ఆందోళన చెందవద్దని అందరికి యూరియా అందుబాటులో ఉంచుతామని అలాగే ఇప్పటి వరకు మండలంలోని రైతులకు 262 టన్నుల యూరియా రైతు సేవ కేంద్రాలు ద్వారా అందిచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ, అగ్రికల్చర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: ఒక చిన్న పుస్తకం ఒక పెద్ద ఆలోచనకు దారి తీస్తుందని, ఒక అక్షరం ఒక జీవితానికి మార్గదర్శి అవుతుందని విజయనగరం నియోజకవర్గం శాసనసభ్యులు పూసపాటి అతిథి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. ఈ ఆలోచనలో బాగంగా శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజుకి వివిధ సందర్భాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందజేసిన పుస్తకాలను సోమవారం విజయనగరం పట్టణం 48వ డివిజన్, గాజులరేగలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల, మండల పరిషత్ పాఠశాల (రెగ్యులర్), మండల పరిషత్ పాఠశాల (స్పెషల్)లకు చెందిన మొత్తం 598 మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కర్రోదు నర్సింగరావు, అనురాధ బేగం తదితరులు పాల్గొన్నారు.

శిశు గృహ, నవజీవన్ చిల్డ్రన్ హోమ్ తనిఖీ

విశాలాంధ్ర - విజయనగరం, కంటోన్మెంట్: కే.ఎల్.పురంలో నిర్వహిస్తున్న శిశు గృహం, కనపాకులో నిర్వహిస్తున్న నవజీవన్ చిల్డ్రన్ హోమ్‌ను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోమ్‌లో ఉంటున్న బాల బాలికలకు సరైన వసతి సౌకర్యాలు ఉన్నవి లేనిది తనిఖీ చేశారు. పిల్లలకి అందిస్తున్న ఆహారం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలు పిల్లలకు అందుతున్నాయా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్లను, వంటగదిలను తనిఖీ చేశారు.బాత్రూంలో ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

విశాలాంధ్ర - రామభద్రపురం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒక వ్యక్తికి 10000 రూపాయలు జరిమానాను సాలూరు కోర్టు న్యాయమూర్తి సోమవారం విధించారని స్థానిక ఎస్సై వెలమల ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బీహార్‌కు చెందిన రాంబల్లి కుమార్ ఆదివారం రామభద్రపురం నుంచి కుంటినవలస వెళుతుండగా తనిఖీల్లో భాగంగా ఆయనని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో బ్రీత్ అనలైజర్ నోటిలో పెట్టి తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నాడని నిర్ధారణ అయిందని తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేశామని అన్నారు.

బొబ్బిలి ఏఎంసీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర - బొబ్బిలి: నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని ఏఎంసీ కార్యాలయంలో నిర్వహించారు. ఏఎంసీ అధ్యక్షులు, శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా మార్కెట్ కమిటీ సభ్యుల బాధ్యతలపై అవగాహన కల్పించుకుని, అధికారులతో చర్చించి వార్షిక ఆదాయ మార్గాలు, ఆదాయ అభివృద్ధి కోసం తీసుకోవలసిన నిర్ణయాలను గురించి చర్చించారు. రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు గురించి, ఏఎంసీ ద్వారా రైతులకు కల్పించాల్సిన మౌళిక సదుపాయాలను గురించి మాట్లాడడం జరిగింది. ఏఎంసీ ద్వారా రైతుల అభివృద్ధి కోసం పనిచేయాలనేదే తమ ఆకాంక్ష అని, అందుకు ఏఎంసీ చైర్మన్ మరియు డైరెక్టర్లు అందరూ పూర్తి సహకారం అందిస్తారనే నమ్మకం తనకు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, ఎంపీపీ మరియు జడ్పీటిసి ప్రతినిధి నర్సుపల్లి వెంకటేష్, బేతనపల్లి శ్రీరామ్మూర్తి , మింది రామకృష్ణ, పసుమర్తి గౌరీ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజీ 3
విజయనగరం
మంగళవారం 9, సెప్టెంబర్ 2025

అశోక్ గజపతి రాజుపై బొత్స వ్యాఖ్యలు తగవు

రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయనగరం: రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమే అయినా శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఆదర్శవంతమైన ప్రజానేత పూసపాటి అశోక్ గజపతి రాజుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం విదేశీ పర్యటనలో వున్న మంత్రి శ్రీనివాస్ వైకాపా నేత బొత్స సత్యనారాయణ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై స్పందించి ప్రకటన విడుదల చేశారు. దేశంలోనే ఆదర్శవంతమైన నాయకుల్లో పూసపాటి అశోక్ గజపతి రాజు ప్రథమ వరుసలో నిలిచే నాయకుడనీ, 45 ఏళ్ళుగా విలువలతో కూడిన రాజకీయాలకు నిలువెత్తు రూపమైన అశోక్ గజపతి రాజు గురించి అవాకులు చవాకులు పేలడం తగదని హితవు పలికారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మంత్రిగా వారు నిర్వర్తించిన బాధ్యతలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయనీ, ఆర్థిక, రెవెన్యూ శాఖల మంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన వ్యక్తి అశోక్ గజపతి రాజు అని అన్నారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా పని చేసినఅశోక్ గజపతి రాజు పౌరవిమానయాన సేవలను మరింత మెరుగు పరిచి, ఎన్నో విమానాశ్రయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో వారి కృషి అమోఘమని, విజయనగరం పట్టణాభివృద్ధికి, ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రగతిలో వారి పాత్ర అనిర్వచనీయమనీ మంత్రి తెలిపారు. అటువంటి గొప్ప నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాననీ అన్నారు. అటువంటి వ్యక్తిని ఎవరో మెప్పు కోసం విమర్శించడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని, సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉన్న బొత్స సత్యనారాయణ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించటం తగదని హితవు పలికారు. బొత్స సత్యనారాయణ తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పి వెనకకు తీసుకోవాలని ఈ ప్రకటన ద్వారా మంత్రి శ్రీనివాస్ హితవు పలికారు.

5000 ఎకరాల్లో ఐటీ పార్కులు

త్వరలో భూ సేకరణ

జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లా దశ తిరిగే అవకాశం వచ్చింది. జిల్లా అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం గ్రోత్ ఇంజన్ గా మారనుంది. భోగాపురం విమానాశ్రయం సమీపంలో ఐటి పార్కులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నద్ధమవుతుంది. దీనిలో భాగంగా సుమారు 5000 ఎకరాలను ఐటి పార్కులను స్థాపన కోసం సేకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రకటించారు. త్వరలోనే భూసేకరణ ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర లోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి తదితర జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఇతర ఉన్నతాధికారులతో, ఆర్టీజీస్, ఐటిఈ%సి కార్యదర్శి కాటంనేని భాస్కర్ సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ జిల్లాలో ఐటీ పార్కుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, భూముల లభ్యతపై చర్చించారు. అనకాపల్లి నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు, అలాగే విమానాశ్రయం దాటిన తర్వాత కూడా జాతీయ రహదారికి పదిహేను కిలోమీటర్ల లోపల స్థలాలను గుర్తించాలని ఆయన సూచించారు. ఈ స్థలాల్లో మౌలిక సదుపాయాలను, రహదారులను ప్రభుత్వమే కల్పిస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఐటీ అభివృద్ధికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయం వరకు జాతీయ రహదారి కిరువైపులా 200 మీటర్ల పరిధిలో ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే సుమారు 754 ఎకరాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. వీటిలో 20 ఎకరాలకు పైబడిన స్థలాలనే గుర్తించామని, 100 ఎకరాలు పైబడిన మూడు భాకులు వీటిలో ఉన్నాయని తెలిపారు. వీటిల్లో అధిక శాతం ప్రభుత్వ భూములు, డి పట్టా భూములే ఉన్నాయని వివరించారు. తాజా ఆదేశాల మేరకు 15 కిలోమీటర్ల లోపల ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి వెంటనే నివేదిక పంపిస్తామని కలెక్టర్ తెలిపారు.

సూపర్ సిక్స్.. సూపర్ హిట్ బహిరంగ సభ

విజయవంతం చేయాలి : కిమిడి నాగార్జున

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: సోమవారం కళ్యాణ దుర్గం నియోజకవర్గ నాయకులుతో సమావేశంలో పాల్గొన్న పరిశీలకులు కిమిడి నాగార్జున. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ బుధవారం అనంతపురం వేదికగా కూటమి పార్టీల భారీ బహిరంగ సభ కళ్యాణ దుర్గం నియోజకవర్గం నుండి బహిరంగ సభకు భారీగా మహిళలును హాజరుకావాలిని కోరారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. 15 నెలలో పాలనా విజయాలను ప్రజల ముందు ఆవిష్కరించేలా భారీ బహిరంగ సభ ఏడాదిన్నరలోనే అత్యంత కీలకమైన నిర్ణయాలు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన కూటమి ప్రభుత్వం అని అన్నారు. సవాళ్లున్నా సంక్షేమాన్ని కొనసాగించిన కూటమి ప్రభుత్వం అన్నారు.అడ్డంకులను అధిగమించి నవ్యాంధ్ర అభివృద్ధి, సుపరిపాలనతో బ్రాండ్ ఇమేజ్.. పెట్టుబడులకు భరోసా అన్ని వర్గాలకు బాసటగా నిలిచిన కూటమి పాలన అని కొనియాడారు. ఇప్పటికే పార్టీల వారీగా టీడీపీ, జనసేన, బీజేపీ వేర్వేరుగా సమావేశాలు ఇప్పటి వరకు అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు - అభివృద్ధి కార్యక్రమాలగురించి బహిరంగ సభ ద్వారా ప్రజలకు చెప్పడమే లక్ష్యం అని అన్నారు.